క్లుప్తంగా

వృత్తి విద్య వల్ల ఉపాధి అవకాశాలు

మైదుకూరు : వృత్తి విద్య వల్ల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ హెడ్మాస్టర్ ఎస్ఎండీ ఇలియాస్ అహ్మద్ అన్నారు. శనివారం పాఠశాలలో ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ పదోతరగతి చదివే విద్యార్థులకు వృత్తి విద్యా కార్యక్రమంలో భాగంగా ఐటీ, ఐటీ ఈఎస్ ట్రేడ్‌లో అనుభవపూర్వకమైన శిక్షణ అందిస్తారన్నారు. ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు క్షేత్రస్థాయిలో డిజిటల్ సేవలు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ వంటి వాటిలో నైపుణ్యాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జీసీడీఓ దార్ల రూత్ ఆరోగ్య మేరి, ఒకేషనల్ కోఆర్డినేటర్లు వంశీ చిన్నారెడ్డి, సునీల్ కుమార్, ఒకేషనల్ ట్రైనర్ జెర్రి గురుమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

బద్వేలు అర్బన్ : అర్బన్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. చింతపుత్తాయపల్లెకు చెందిన కుంచం జయసుబ్బారెడ్డి, భావనారాయణ నగర్‌కు చెందిన చిన్నసుబ్బరాయుడు బహిరంగ ప్రదేశంలో మద్యం విక్రయాలు సాగిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు నిఘా ఉంచి వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 12 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు.

జీఎస్టీ సవరణను సద్వినియోగం చేసుకోవాలి

బి.కోడూరు : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సవరణను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. శనివారం బి.కోడూరులో గ్రామ సమాఖ్య సంఘాలకు జీఎస్టీ, మహిళల భద్రత, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల నివారణ తదితర అంశాలపై అవగాహన, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సంజీవరాజు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం బద్వేలు రూరల్ సీఐ క్రిష్ణయ్య మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల నివారణ, గృహహింస, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు జిలాని, పీటర్, రత్నమ్మ, వీఓ సమాఖ్య సభ్యులు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఖాజీపేట : డిజిటల్ ప్రపంచంలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని వాటిపై అవగాహన కలిగి ఉండాలని ఖాజీపేట సీఐ వంశీధర్ డ్వాక్రా మహిళలకు సూచించారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవ్ అనే కార్యక్రమం ఖాజీపేట ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. మీ కార్డు లేక బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరికి చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అలాగే సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు ఎవ్వరూ చేయవద్దని సూచించారు. డీఎల్ డీఓ మైథిలి మాట్లాడుతూ జీఎస్టీని భారీగా తగ్గించడం జగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివిజసంపతి, ఎంపీఎం శైలజా, డ్వాక్రా సీసీలు, సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



వైద్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రముఖులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు, పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవని ఆర్థో, స్పైన్ అండ్ డెంటల్ క్లినిక్‌ను ప్రారంభించామని వైద్యులు వేంపల్లి వెంకటశివారెడ్డి, కె.కుముదలు తెలిపారు. జమ్మలమడుగు రోడ్డులోని చింతచెట్టు వద్ద శనివారం వేంపల్లి అవని ఆర్థో, స్పైన్ అండ్ డెంటల్ క్లినిక్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో ఎమర్జెన్సీ ట్రామా, వెన్నెముక సమస్యలు, ఫ్రాక్చర్స్, దంత సమస్యలకు 24 గంటలు వైద్య సేవలను అందిస్తామని తెలిపారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : మోడంపల్లె పెద్దమ్మతల్లి ఆలయంలో గాయత్రి దేవి

శ్రీకరి.. శుభకరి


దేవీ శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా శనివారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవిగా వాసవి మాత భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయంలో, వెంకటేశ్వర్లపేట చౌడేశ్వరిదేవి ఆలయంలో, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో, రాజరాజేశ్వరి ఆలయంలో, అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనలక్ష్మిగా అమ్మవారిని అలంకరించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో సంతాన లక్ష్మీదేవిగా, మోడంపల్లె పెద్దమ్మతల్లి ఆలయంలో గాయత్రిదేవిగా అలంకరించారు. – ప్రొద్దుటూరు కల్చరల్



ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో గజలక్ష్మీదేవి



గోపవరం : ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



ప్రొద్దుటూరు కల్చరల్ : శివాలయంలో గజలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



కలసపాడు: రాజరాజేశ్వరిదేవి అలంకారంలో కన్యకాంబ



బద్వేలు అర్బన్ : అమ్మవారిశాలలో అష్టలక్ష్మిదేవి అలంకారం



బద్వేలు అర్బన్ : కోదండరామాలయంలో శ్రీరాముడి అలంకారం



పోరుమామిళ్ల : కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, పార్టీ నాయకులు



కాశినాయన : లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో గజలక్ష్మీదేవి అలంకారం



రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనలక్ష్మీదేవి



ప్రొద్దుటూరు కల్చరల్ : చెన్నకేశవస్వామి ఆలయంలో సంతాన లక్ష్మీదేవి



వెంకటేశ్వర్లపేట చౌడేశ్వరిదేవి ఆలయంలో గజలక్ష్మీదేవిగా అమ్మవారు



బి.మఠం : వెంకటాద్రి స్వామి దంపతులను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

స్త్రీ శక్తి యాప్‌పై అవగాహన

రాజుపాళెం : మహిళలంతా అత్యవసర పరిస్థితుల్లో స్త్రీ శక్తి యాప్‌ను ఉపయోగించుకోవాలని రాజుపాళెం ఎస్ఐ కె.వెంకటరమణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని వెలుగు కార్యాలయంలో మహిళల భద్రత, డ్రగ్స్, స్త్రీ శక్తి యాప్, జీఎస్టీపై మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా డ్రగ్స్ వాడుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే ప్రతి ఒక్క మహిళ వారిపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళలకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ షాకీర్ అలీఖాన్, కొర్రపాడు పశువైద్యాధికారి లక్ష్మీదేవి, వెలుగు ఏపీఎం సుజాత, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఏరియా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల కొరత తీర్చండి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సీమాంక్ ఆసుపత్రి, పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రులలో వైద్యుల కొరతను తీర్చి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముఖ్య పట్టణాలైన బద్వేలు, పోరుమామిళ్లల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో గత కొంత కాలంగా వివిధ విభాగాల్లో వైద్యుల కొరత ఉండటం వలన పేదలకు సరైన వైద్యం అందడం లేదన్నారు. తక్షణమే అధికారులు, పాలకులు స్పందించి తగినంత మంది వైద్యులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్, ఏరియా కమిటీ సభ్యులు రామరాజు, బాబు, నారాయణ, జయరామరాజు, విజయరావు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలి

చాపాడు : గంజాయి, డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల అభివృద్ధి అధికారి వీరకిశోర్ తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో శనివారం గంజాయి, డ్రగ్స్, నేరాలు, ప్రభుత్వ పథకాలు, జీఎస్టీ తగ్గింపు వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజా అవసరమైన వాటిని ప్రతి ఒక్కరూ ఆస్వాదించి వినియోగించుకోవాలని, ప్రజా వ్యతిరేకమైన డ్రగ్స్, గంజాయి, నేరాలు వంటి వాటికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. వీటి వలన కలిగే దుష్పరిణామాలను వివరించాలన్నారు. ఏఎస్ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పోలీసు చట్టాలు, నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా ఘర్షణలకు పాల్పడకుండా పోలీసులను సంప్రదించాలని, దీని వలన ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఏపీఎం శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అందజేస్తున్న రుణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివకుమార్ పాల్గొన్నారు.

'కార్పొరేట్‌లను మోదీ ప్రభుత్వం పెంచి పోషిస్తోంది'

బద్వేలు అర్బన్ : దేశంలో హిందుత్వం పేరుతో మతోన్మాదాన్ని, కార్పొరేట్ శక్తులను బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి పెంచి పోషిస్తోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సీపీఎం బద్వేలు ప్రాంతీయ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. దేశంలో లౌకికవాదాన్ని మంట కలుపుతూ, మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజా సమస్యలు దారి మళ్లించి నియంతలాగా దేశాన్ని మోడీ పరిపాలిస్తున్నారని ఆరోపించారు. దీనికి రాష్ట్రంలోని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తోడు కావడం దురదృష్టకరమన్నారు. జీఎస్టీ పేరుతో సంవత్సరాల పాటు ప్రజలను దోచుకుని బిహార్ ఎన్నికల నేపథ్యంలో జీఎస్టీని తగ్గించి ప్రజల కోసం పనిచేస్తున్నట్లు పోజుకొట్టడం మోడీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. మనదేశ అంతర్గత విషయాల్లో అమెరికా అధ్యక్షుడు పెత్తనం చెలాయిస్తూ ఉంటే నోరెత్తడం చేతకాని దద్దమ్మ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శివకుమార్, జిల్లా కమిటీ సభ్యురాలు గౌసియాబేగం, పట్టణ కమిటీ సభ్యులు చిన్ని, శివ, నాగేంద్రబాబు, సుబ్బరాయుడు, భైరవప్రసాద్ పాల్గొన్నారు.

బాధితులకు శ్రీరామరక్ష

వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన రాచమల్లు



క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరిస్తున్న రాచమల్లు, నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : బాధితులకు వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ శ్రీరామరక్ష అని, అలాగే పార్టీ కార్యకర్తలు, నాయకులను వేధించిన వారికి యమపాశం లాంటిదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలు, నాయకులను టీడీపీ ప్రభుత్వంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు వేధింపులకు గురి చేస్తే డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఇందులో తక్షణం స్పందించాల్సిన సమస్య ఉంటే వెంటనే పార్టీ పెద్దలు స్పందిస్తారని రాచమల్లు తెలిపారు. తీవ్రంగా వేధించిన అధికారుల పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదు అవుతాయని, మూడున్నర ఏళ్ల తర్వాత వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు డిజిటల్‌బుక్ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించుకోవాలని రాచమల్లు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఈసీ వ్యవహార శైలి మారాలి'

పోరుమామిళ్ల : భారతీయ జనతా పార్టీతో కుమ్మక్కై ఓట్ల దొంగతనానికి పాల్పడిన కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) వ్యవహార శైలి మార్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎస్.డి.విజయజ్యోతి పేర్కొన్నారు. లక్ష సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా శనివారం పోరుమామిళ్లలో ఆపార్టీ మండల అధ్యక్షులు అన్వర్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయజ్యోతి మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వేసిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం దగ్గర ఎలాంటి సమాధానం లేదన్నారు. సమాధానం చెప్పలేక ఎన్నికల సంఘం నీళ్లు నములుతున్న విషయం ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. రాజ్యాంగబద్ధ, స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం వైఖరి రాజ్యాంగానికి మాయని మచ్చ అన్నారు.

ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాలి

ప్రొద్దుటూరు క్రైం : నగరవనం పార్కు సందర్శనకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాలని కర్నూలు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీవీఏ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ఆయన ప్రొద్దుటూరులోని సబ్ డివిజనల్ అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏకోపార్కులో ఏర్పాటు చేస్తున్న నగరవనం పనులను పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన ఇతర పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కల పెంపకం, డ్రిప్ సిస్టం, ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ గురించి అధికారులకు సూచనలు చేశారు. ఇప్పటి వరకు జరిగిన నగరవనం పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర అభివృద్ధి పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్, ప్రొద్దుటూరు సబ్‌డీఎఫ్ఓ సంకేత్ సునీల్ గరుడ్, ప్రొద్దుటూరు ఎఫ్ఆర్ఓ హేమాంజలి, స్క్వాడ్ డీఎఫ్ఓ రాజశేఖర్‌బాబు, స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ రామ్లానాయక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం కళాశాల పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. 2013, 2014, 2015, 2016 సంవత్సరాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థినులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ నాటి తమ జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు సమాజంలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఆనాటి అధ్యాపకులను పూర్వ విద్యార్థినులు ఘనంగా సత్కరించారు. కరస్పాండెంట్ బాబమ్మ, కో డైరెక్టర్ శైలుష, డిప్లొమా ప్రిన్సిపాల్ ప్రకాశ్ రావు, హెచ్ఓడీలు ఆలీ, జాబీర్, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ రిపబ్లిక్ డే శిక్షణకు ఎంపికైన మైదుకూరు విద్యార్థి

మైదుకూరు : గుజరాత్‌లో నిర్వహించే ప్రీ రిపబ్లిక్ డే శిక్షణ కార్యక్రమానికి మైదుకూరు చెందిన ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థి బి.నవీన్ ఎంపికయ్యాడు. యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల తరపున ప్రీ రిపబ్లిక్ డే శిక్షణకు తమ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్, బీఎస్సీ మూడో సంవత్సరం విద్యార్థి నవీన్ మాత్రమే ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విశ్వవిద్యాలయంలో నవంబర్ 1 నుండి 10వ తేదీ వరకు జరిగే ప్రత్యేక శిక్షణ శిబిరానికి ఈ విద్యార్థి హాజరుకానున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. జాతీయస్థాయిలో ప్రతిభావంతులైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మాత్రమే కల్పించిన ఈ అవకాశం తమ కళాశాల విద్యార్థికి దక్కడ తమ కళాశాలకే కాకుండా యోగివేమన యూనివర్సిటీకే గర్వకారణమని తెలిపారు.